# సూర్య

www.suryaa.com

17 వ

కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా

కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం,17 జూన్ 2024




## పాత్రికేయులకు పోలీసులు ఆత్మీయ విందు..!



**గొల్లప్రోలు,మేజర్ న్యూస్ :** పిఠాపురం సీఐ ఆధ్వర్యంలో పాత్రికేయులకు పోలీసులు ఆత్మీయ విందు ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికలు ముగియడంతో గొల్లప్రోలు మండలం చేబ్రోలు సత్తమ్మ తల్లి ఆలయం సమీపంలో గల కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన విందులో పోలీసులు పాత్రికేయులు ఎంతో ఉల్లాసంగా పాల్గొన్నారు. ఇటీవల జరిగిన పిఠాపురం అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో ఊపిరి పీల్చుకున్న పోలీసులు ఎంతో ప్రసిద్ధిగాంచిన చేబ్రోలు సత్తెమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకుని ఈ విందు ఏర్పాటు చేశారు. పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ గున్నా బత్తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఆత్మీయ విందులో పిఠాపురం నియోజకవర్గ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులతో పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గల పలువురు సీనియర్ పోలీసు అధికారులు ఈ ఆత్మీయ విందులో పాల్గొన్నారు.కాకినాడ జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగినందుకు ఆత్మీయ విందు ఏర్పాటు చేయడం జరిగిందని గొల్లప్రోలు ఎస్సై బాలాజీ తెలిపారు.ఈ విందులో పాల్గొనేందుకు విచ్చేసిన పోలీస్,పాత్రికేయ అతిధులకు పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ఆప్యాయంగా పలకరిస్తూ సాధనంగా ఆహ్వానించారు.నచ్చిన రీతిలో మృతికరమైన పలు వంటకాలతో విందును ఏర్పాటు చేసి పాత్రికేయులు పోలీసులు వేరువేరు కాదంటూ ఫ్రెండ్లీ పోలీస్ గా నిరూపించుకున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సాగిన ఈ విందు కార్యక్రమంలో పోలీస్ ఉన్నతాధికారులు, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# డ్రగ్ ట్రేడర్స్ సేవలు అభినందనీయం

### -ఎమ్మెల్యే పంతం






**కాకినాడ, మేజర్ న్యూస్ :** సామాజిక అవసరాల గుర్తించి డ్రగ్ ట్రేడర్స్ అసోసియేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ అన్నారు. ది కాకినాడ కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ మరియు కాకినాడ జిల్లా డ్రగ్ ట్రేడర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ హాల్లో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అసిస్టెంట్ డ్రగ్కంట్రోలర్ శ్రీమతిడినాగమణి (రాజమండ్రి) లాంఛనంగా ప్రారంభించగా గౌరవ అతిథిగా శాసనసభ్యులు పంతం నానాజీ పాల్గొని ప్రసంగిస్తూ అసోసియేషన్ పరంగా సమస్యలు ఉన్న యెడల తన దృష్టికి తీసుకొచ్చిన వాటిని పరిష్కరించడానికి తప్పకుండా కృషి చేస్తానన్నారు. గత నాలుగు దశాబ్దాలుగా ఇదే ప్రాంతంలో ఉన్నానని మీకందరికీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఆయన ప్రకటించారు. రక్తదాన శిబిరం నిర్వహించడం గొప్ప విషయం గా ప్రశంసిస్తూ నేడు సకాలంలో రక్తం లభించగా అనేకమంది మరణిస్తున్నారని చెప్పారు డ్రగ్ ట్రేడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదానంపై అవగాహన శిబిరాన్ని కూడా తరచూ నిర్వహించాల్సిందిగా సూచించారు. మీ మీ మెడికల్ షాపుల్లో రక్తదానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలతో పాటు మాదకద్రవ్యాల వినియోగం వల్ల సమాజానికి ముఖ్యంగా యువతకు కలిగే నష్టాన్ని కూడా వివరిస్తూ ప్రత్యేక పోస్టర్లను ఏర్పాటు చేయవలసిందిగా సూచించారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో పంతంను ఘనంగా సత్కరించారు.అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్ డినాగమణి(రాజమండ్రి) మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్యకర వాతావరణం కల్పించడంలో డ్రగ్ ట్రేడర్స్ పాత్ర చాలా ముఖ్యమని అన్నారు. నేడు బ్లడ్ బ్యాంక్ నందు సరిపడా రక్త నిలువలు లేకపోవడం వల్ల రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని యువత కూడా స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందు రావలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించడంలో గ్రామీణ ప్రాంతాలలో డ్రగ్ ట్రేడర్స్ పాత్ర ప్రముఖంగా ప్రస్తావిస్తూ ప్రజల ఆరోగ్యానికి అవసరమైన సూచనలు సలహాలు అసోసియేషన్ సభ్యులు ఎప్పటికప్పుడు అందిస్తూ ఉండాల్సిందిగా కోరారు. దీనివల్ల గ్రామీణ ప్రజలకు అనారోగ్య సమస్యల నుండి కొంతవరకైనా రక్షించిన వారు అవుతారని ఆమె చెప్పారు.అంతకుముందు కాకినాడ జిల్లా అసోసియేషన్ లోగోను డినాగమణిఆవిష్కరించి లోగోలో పొందుపరిచిన అంశాలపై విశ్లేషిస్తూ సామాజికసేవతో పాటు ప్రజారోగ్యాన్ని రక్షించడంలోనూ ప్రత్యకశ్రద్ధ తీసుకోవాల్సిందిగా ఆమె కోరారు. శ్రీమతి నాగమణి నీ జిల్లా అసోసియేషన్ మరియు నగర అసోసియేషన్ సంయుక్తంగా ఘనంగా సత్కరించి విశేషమైన జ్ఞాపకం అందజేసి అభినందనలు తెలిపారు కాకినాడ రూరల్ డ్రగ్ ఇన్స్పెక్టర్ ఎం మురళి ని కూడా సత్కరించారు. తెలుగుదేశం పార్టీ నగర కమిటీ అధ్యక్షులు వీరు గౌరవ అతిథిగా పాల్గొని అసోసియేషన్ చేస్తున్న సేవలను ప్రశంసించారు.శ్రీ యువజన సేవ వ్యవస్థాపకులు సతీష్ ను ఎమ్మెల్యే పంతం చేతులమీదుగా ఘనంగా సత్కరించారు. ట్యాగ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన కొమ్మిశెట్టి కుమార్ ను అసిస్టెంట్ కంట్రోలర్ డి నాగమణి చేతుల మీదుగా సత్కరించి ప్రత్యేక జ్ఞాపకం అందజేశారు. రక్తదానం చేసిన వారిని ప్రశంసాపత్రాలతో సత్కరించారు. ఈ రక్తదాన శిబిరంలో సుమారు 120 మంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. సిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ మణికుమార్ ఆధ్వర్యంలో బీపీ షుగర్ పరీక్షల జరిపి అనే సూచనలు చేశారు ఆయన్ని కూడా అసోసియేషన్ సభ్యులు సత్కరించారు.సిటీ హాస్పిటల్ వైద్య సిబ్బంది డాక్టర్ ఫాతిమా ఆధ్వర్యంలో రాజేష్ శిరీషలు ప్రతి ఒక్కరిని వైద్య పరీక్షలు చేశారు.కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జి గిరిధర్, కార్యదర్శి మూగులపల్లి గుప్తా,కోశాధికారి ఎస్ శ్రీనివాసరావు, కాకినాడ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్సత్యనారాయణ కార్యదర్శి జి రాంప్రసాద్,కోశాధికారి కేసురేష్,గౌరవఅధ్యక్షులుచోరిశెట్టి కాశి, చిట్టూరి సుబ్రహ్మణ్యం తో పాటు అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు

## కవిత్వాన్ని ప్రజాస్వామీకరించిన శ్రీ శ్రీ

-శ్రీ శ్రీ స్ఫూర్తి కొనసాగుతూనే ఉంది

-ప్రజా సంఘాలు నిర్వహించిన

శ్రీశ్రీని స్మరించుకుందాం కార్యక్రమంలో అద్దేపల్లి ప్రభు



**కాకినాడ,మేజర్న్యూస్:** కవిత్వాన్ని ప్రజాస్వామీకరించడం, కష్టజీవుల పక్షాన నిలబడడం శ్రీ శ్రీ వల్లనే సాధ్యం అయ్యిందని అద్దేపల్లి ప్రభు కొనియాడారు. శనివారం సాయంత్రం కాకినాడ యుటిఎఫ్ హెూం లో శ్రీ శ్రీ 41 వ వర్ధంతి సందర్భంగా శ్రీ శ్రీ ని స్మరించుకుందాం అనే కార్యక్రమం నిర్వహించారు. యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి. ప్రభాకర వర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీ – నేడు అనే అంశంపై అద్దేపల్లి ప్రభు మాట్లాడారు. సాధారణ ప్రజలు కూడా శ్రీ శ్రీ కవితలు చదివి స్ఫూర్తి పొందుతారన్నారు. కవిత్వాన్ని ప్రజాస్వామీకరించడం లో, కష్టజీవుల పక్షాన నిలబడడం లో శ్రీ శ్రీ మరొక సాటి లేరన్నారు. రాజకీయ చైతన్యం, మార్క్సిజం తో కొనసాగడం శ్రీ శ్రీ ప్రత్యేకత గా గుర్తించాలన్నారు. శ్రీ శ్రీ స్ఫూర్తి కొనసాగుతూనే ఉంటుందన్నారు. జి. ప్రభాకర వర్మ మాట్లాడుతూ ఆకాశంలో విహరిస్తున్న సాహిత్యాన్ని భూమార్గం పట్టించిన ఘనత శ్రీ శ్రీ కే దక్కుతుందన్నారు. జెవివి జిల్లా అధ్యక్షుడు కెఎంఎంఆర్ ప్రసాద్, పెన్షనర్ల సంఘం నాయకులు కె. సత్తిరాజు, ఆవాజ్ కన్వీనర్ ఇబ్రహీం తదితరులు శ్రీ శ్రీ కవితలు చదివి వినిపించారు. ముందుగా జెవివి రాష్ట్ర కార్యదర్శి మురళీధర్ శ్రీ శ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి పలివెల వీరబాబు స్వాగతం పలుకగా వి. శ్రీరామారావు వందన సమర్పణ చేశారు.

## పల్లాల్లమ్మవారిని దర్శించుకున్న

### ఎమ్మెల్యే చినరాజప్ప



**పెద్దాపురంరూరల్,మేజర్న్యూస్:** పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆదివారం మండలంలోని దివిలి గ్రామంలో శెట్టిబలిజ పేటలో వెలసియున్న శ్రీ పల్లాలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట పెద్దాపురం మండలం టిడిపి అధ్యక్షులు కొత్తెం వెంకట శ్రీనివాసరావు (కోటి), సర్పంచ్ పెంకే శ్రీనివాస్, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

## రైతుల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యం

### -కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి



**కొవ్వూరు,మేజర్న్యూస్ :** రైతుల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు మండలం కుమారదేవం, ఆరికరేవుల, గ్రామాలలో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కుమారదేవం గ్రామదేవత గండి పోచమ్మ అమ్మవారిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోదావరి ఒడ్డున ఉన్న పంపింగ్ స్కీం ద్వారాగోదావరిజలాలను కాలువ ద్వారా విడుదల చేశారు.అనంతరం గోదావరి మాతకు పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఆరకిరేవుల గ్రామంలోనీ వాలీబాల్ జట్టుకు కొవ్వూరు లైన్స్ క్లబ్ అందజేసిన క్రీడా దుస్తులను ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు టిడిపి ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ చౌదరి, కంటమణి రామకృష్ణ మండల టిడిపి అధ్యక్షులు వట్టికూటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఇప్పీ తాజా ప్రచారం ఇప్పీ

### -టాస్‌ని ఆవిష్కరించిన రాహుల్

### ద్రవిడ్, జస్ప్రీత్ బుమ్రా, సూర్య కుమార్ యాదవ్



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** సన్‌ఫీస్ట్ ఇప్పీ తమ ఇన్‌స్టాగ్రామ్‌లో తమ తాజా ప్రచారం ఇప్పీ టాస్ గురించి వెల్లడించింది. ప్రచారం గురించి ఐటిసి లిమిటెడ్ స్నాక్స్, నూడుల్స్& పాస్తా, ఫుడ్ బిజినెస్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కవితా చతుర్వేది మాట్లాడుతూ సన్‌ఫీస్ట్ ఇప్పీ సన్ ఫీస్ట్ నుండి ప్రముఖ ఇన్‌స్టంట్ నూడిల్, పాస్తా బ్రాండ్, దేశంలో ఎక్కువ మంది ఇష్టపడే క్రికెటర్లు –రాహుల్ ద్రవిడ్, జస్ప్రీత్ బుమ్రా సూర్య కుమార్ యాదవ్‌ల తో తీర్చిదిద్దిన సరికొత్త ప్రచారంతో ఇది తిరిగి వచ్చిందన్నారు. ఈ వినోదభరితమైన ప్రచారంతో క్రికెట్ ఉత్సాహం తారాస్థాయి చేరుకుందన్నారు.జస్ప్రీత్ బుమ్రా, సూర్య కుమార్ యాదవ్ తమ ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్స్‌లో 'ది టాస్' గురించి పంచుకున్న పోస్ట్‌ల వెనుక రహస్యం తెలుసుకోవాలనే ఆసక్తితో ఇప్పటివరకు ఇంటర్నెట్‌లో ఆసక్తి నెలకొంది అన్నారు. ఆటగాళ్ల పోస్ట్ ల వెనుక అర్థం తెలియక సతమతమైన అభిమానుల ఆసక్తిని మరింత పెంచుతూ, ఇతరులు కూడా దీనిపై వైరల్ చేశారన్నారు. ఈ నూతన ప్రచారంలో రాహుల్ ద్రావిడ్ ప్రారంభించారన్నారు. ఐటీసి సన్ ఫీస్ట్ ఇప్పి నూతన టీవీసి అందరినీ ఆకట్టుకుంటుందని చెప్పారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి







### -ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసిన ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు


### -ఫెడరేషన్ ప్రతినిధులను తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తా..-ఎంపీ ఉదయ్ హామీ

**కాకినాడ, మేజర్ న్యూస్ :** జర్నలిస్టులందరూ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తాము కృషి చేస్తామని కాకినాడ ఎంపీ తంగేళ్ళ ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, పంతం నానాజీలు హామీ ఇచ్చారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఎంపీ, ఎమ్మెల్యేలను ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) జిల్లా నాయకత్వం ఆదివారం కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ కాకినాడ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వాతాడ నవీన్ రాజ్, ముమ్మిడి లక్ష్మణ్ జర్నలిస్టుల సమస్యలను వారికి వివరించారు. నిబంధనలను తొలగించి అక్రిడిటేషన్ కార్డులను అందరికీ జారీ చేయాలన్నారు. వర్కింగ్ జర్నలిస్టులందరికీ త్వరితగతిన ఇళ్ల స్థలాలు మంజూరు చేయించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

మీమీ సమస్యలను అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని ఎమ్మెల్యేలు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఫెడరేషన్ ప్రతినిధులను అధిష్టానం వద్దకు తీసుకొని వెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జనసేన పార్టీ అధినేత మొదటి నుంచి జర్నలిస్టుల పట్ల సానుకూల భావనతో ఉన్నారని ఎంపి తెలిపారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ ను ఇంత పటిష్టం చేసిన నవీన్ రాజ్ ను ఎమ్మెల్యేలు నిమ్మకాయల చిన్నరాజప్ప, పంతం నానాజీలు అభినందించారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ కు నవీన్ రాజు మొదటి నుండి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని అందుకే యూనియన్ అటు రాష్ట్రంలో ఇటు జిల్లాలలో ఇంత పటిష్టంగా ఉందన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసిన వారిలో రాష్ట్ర సభ్యులు ఎండి అధికార్, ఎస్.కె మున్ని, జిల్లా నాయకులు పుర్రె త్రినాధ్, బొండాడ భాస్కర్, బిందాన సురేష్, ధర్మరాజు, రామ్ ప్రసాద్, కొమ్ము సురేంద్ర, రెడ్డి, నక్క శ్రీను, రాము, పండు తదితరులు ఉన్నారు.

## అన్ని అర్హతలు ఉన్న ప్రత్తిపాటి ప్రసాద్ కుమార్‌కు

## టీటీడీ బోర్డు మెంబర్‌షిప్ ఇవ్వాలి



**పెరవలి, మేజర్ న్యూస్ :** రాజకీయాల్లో నైతిక విలువలు పాటిస్తూ మృదుస్వభావంగా ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉంటూ ముందుకు వెళ్లే నాయకులు కొద్దిమందే ఉంటారు. అటువంటి వారి కోవలో నిలిచే వ్యక్తి పెరవలి మండలం తీపర్రు గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు ప్రత్తిపాటి ప్రసాద్ కుమార్ అనవచ్చు. జనసేన పార్టీ స్థాపించినప్పటి నుండి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వ్యక్తిత్వాన్ని విలువలు పాటించే విధానాన్ని అభిమానించిన ప్రసాద్ కుమార్ జనసేనలో జాయిన్ అయినప్పటినుండి జనసేన పార్టీ సిద్ధాంతాలను అభిమానిస్తూ ఆచరిస్తూ ముందుకు వెళ్తున్న యువ రాజకీయ నాయకుడు ప్రసాద్ కుమార్ నిత్యం ప్రజల్లో ఉంటూ తన చేతనైన సాయం జన సైనికులకు కార్యకర్తలకు అందిస్తూ కార్యకర్తలకు వెన్నుదన్నుగా నిలుస్తున్న ప్రతిపాటి ప్రసాద్ కుమార్ కు తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడుగా అవకాశం కల్పించాలని పెరవలి మండలం జనసైనికులతో పాటు అన్ని పార్టీలకు చెందినవారు ముక్త కంఠంతో కోరుతున్నారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల ప్రచారంలో కూడా ఉమ్మడి పార్టీ నాయకులు తీపర్రు గ్రామ ప్రచారానికి వచ్చినప్పుడు ఆయన చేసిన ఏర్పాటులకు నాయకులు కార్యకర్తలు అందరూ ఫిదా అయిన సంగతి తెలిసిందే. ప్రస్తుత రాజకీయాలకు విరుద్ధంగా ఎవరి సొమ్ము ఆశించకుండా తన సొంత కష్టార్జితాన్ని కష్టాలలో ఉన్న ప్రజల సేవలకు ఉపయోగించే ప్రసాద్ కుమార్ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను అమలు చేస్తున్నారని జన సైనికులతో పాటు పెరవలి మండల ప్రజలు అందరూ భావిస్తుంటారు. ఇటువంటి వ్యక్తికి తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యుడుగా అవకాశం ఇస్తే నిస్వార్థమైన స్వచ్ఛమైన సేవలు మా పెరవలి మండలం ప్రజలందరికీ అందిస్తూ ఆ దేవదేవుడు సేవలో తరిస్తారని పెరవలి మండలం ప్రజల చిరకాల వాంఛ ఆయన తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా యువ నాయకుడు ప్రత్తిపాటి ప్రసాద్ కుమార్ కు అవకాశం ఇవ్వాలని పెరవలి మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. పెరవలి మండల జనసైనికుల కోరిక మేరకు ఆ తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడుగా ప్రత్తిపాటి ప్రసాద్ కుమార్ కి అవకాశం ఇవ్వాలని రాష్ట్ర పర్యాటక సినిమాటోగ్రఫీ శాఖల మంత్రివర్యులు నిడదవోలు శాసనసభ్యులు దుర్గేష్ కు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కు నిడదవోలు మాజీ శాసనసభ్యులు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు కు నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు నాయుడు కు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఎమ్మెల్యే జ్యోతులనెహ్రూకు శుభాకాంక్షలు తెలియజేసిన


## రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షులు, రాష్ట్ర టిడిపి కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** రావులమ్మ నగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షులు రాష్ట్ర టిడిపి కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 45 నియోజకవర్గాల్లో పర్యటించి ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం చేయడం జరిగిందని టిడిపి జనసేన బిజెపి అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో గెలుపొందడం జరిగిందని కాపులకు టిడిపి ద్వారానే న్యాయం జరుగుతుందని ఈరోజు రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ గారిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశామని ఆయన నాయకత్వంలో కాకినాడ జిల్లా మరింత అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నామని అన్నారు.కార్యక్రమంలో కాపు నాయకులుసిద్దు నూకరాజు,మాధవరపు తిరుమలరావు, అడపా ప్రకాష్ నాయుడు,బాజిబోయిన వెంకటేష్ నాయుడు,కూరాకుల చినబాబు,రామదేవు సీతయ్య దొర,భావిశెట్టి ప్రసాద్, వాసిరెడ్డి జ్యోతి కుమార్,అత్తిలి పవన్ కుమార్,తదితరు కాపు సద్భావన సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఏళ్ల వయస్సున్న చెట్టుకు పునర్జన్మకు

### -ఆల్ ఈజ్ వెల్ సభ్యులు ప్రయత్నం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** సుమారు 40 ఏళ్ల వయసు కలిగిన చెట్టు వేళ్ళతోపాటు రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. ఆ దారిన వెళ్లేవారు అయ్యో ఇంత పెద్ద చెట్టు పడిపోవడమేమిటి అంటూ ఆవేదన, బాధను వ్యక్తం చేస్తున్నారే తప్పా దాన్ని తిరిగి ఎలా కాపాడుకోవాలి అనే ఆలోచన మాత్రం వారికి రాలేదు. ఇదే విషయం ఆల్ ఈజ్ వెల్ సభ్యులకు ఆ నోట ఈ నోట తెలియడంతో చెట్టు పడిపోయిన కాకినాడ రాజా ట్యాంక్ దగ్గర్లోని నూకాలమ్మ గుడి సమీపంలో ఉన్న ఆ చెట్టు వద్దకు సభ్యులు వచ్చారు. అందరూ ఆ చెట్టును చూస్తూ ఇంత పెద్ద చెట్టు పడిపోయిందని అనుకోవడమే తప్పా తిరిగి పాతి పెట్టి బతికించడం కోసం ఆలోచన మాత్రం వారికి రాలేదు. సరిగ్గా ఇదే ఆలోచన ఆల్ ఈజ్ వెల్ సభ్యులకు రావడంతో ఆ చెట్టుకు తిరిగి పునర్జన్మ ఇచ్చేందుకు వారి వంతు ఎనలేని కృషి చేశారు. ఆ చెట్టును వారు అక్కడి నుంచి తరలించి కాకినాడ నాగమల్లి చెట్టు సమీపంలో ఉన్న జంతు హింస నివారణ కేంద్రంలోనికి (ఎస్పిసిఎ) పాతిపెట్టి దాని చిగురింపచేసేందుకు ఆశలను కల్పించారు.

–దీనికి సంబంధించిన వివరాల్లోకి వెళితే..చెట్లకు కూడా పునర్జన్మలు ఉంటాయా అంటే ఉంటాయని చెబుతున్నారు పర్యావరణ ప్రేమికులు. గత కొద్ది సంవత్సరాలుగా చెట్లను నరకడం వాటిని మళ్లి పెట్టడం తప్పా ఉన్న చెట్లను ఎలా కాపాడాలనేది అధికారులు, ప్రభుత్వాలు ఆలోచన చేయడం లేదు. దీంతో సాధారణంగా ఒక చెట్టు పోయినా మరిన్ని చెట్లను నాటేందుకు ప్రయత్నాలు చేస్తారు. కానీ ఉన్న చెట్టును ఎలా కాపాడాలనే ప్రయత్నం ఏ కొద్దిమందో మాత్రమే చేస్తారు. అటువంటి ప్రయత్నం కాకినాడలోని ఆల్ ఈజ్ వెల్ టీం చేసింది. అనివార్య కారణాల వల్ల తొలగిస్తున్న చెట్లను తిరిగి వాటిని రీ లొకేట్ చేస్తున్నారు. దీంతో కొన్ని సంవత్సరాల తరబడి ఉండే చెట్లను కాపాడుతున్నారు. ఇవాళ అటువంటి ప్రయత్నం ఒకటి కాకినాడలో జరిగింది. ఎస్పిసిఎ రీప్లాంటేషన్ చేశారు. ఈ ప్రయత్నం విజయవంతం అయితే పడిపోతున్న మరిన్ని మొక్కలను రీప్లాంటేషన్ చేయడానికి ఆల్ ఈజ్ వెల్ టీమ్ సభ్యులు సిద్ధంగా ఉన్నారు. ఈ చెట్టును పాతిపెట్టి బ్రతికించే ప్రయత్నం చేస్తున్న ఈ కార్యక్రమంలో ఆల్ ఈజ్ వెల్ కిషోర్, అతని బృందం సభ్యులు పాల్గొన్నారు.

## గ్రంధాలయంలో శ్రీ.శ్రీ వర్ధంతి కార్యక్రమం



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం ప్రధమ శ్రేణి శాఖా గ్రంధాలయంలో శ్రీశ్రీ 41వ వర్ధంతి సభ జరిగింది. ఈ కార్యక్రమానికి సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు డా.జోశ్యుల కృష్ణబాబు అధ్యక్షత వహించగా, గౌరవాధ్యక్షులు చల్లా విశ్వనాధం ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ముందుగా శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జోశ్యుల కృష్ణబాబు, చల్లా విశ్వనాధంలు తెలుపుతూ ఆనాటి విశేషాలను పేర్కొంటూ కవిత ఓ కవితా, ప్రతిజ్ఞ వంటి గేయ కవితలను ఆలపించారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనానికి కార్యదర్శి కొత్త శివ అధ్యక్షత వహించి కవులందరికి మంచి గ్రంధాలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో క్రాంతి, అరుణ, దారపురెడ్డి కృష్ణ, సత్యనారాయణ, వీర్రాజు, అమృత, తాడిగడప సుబ్బారావు, మూర్తి, విమలారాణి, కాశీ విశ్వనాథ్, గ్రంధాలయాధికారి పాలంకి నాగరాజు, సిబ్బంది సింగం బుల్లియ్య, పాఠకులు,పాల్గొన్నారు.

# గొల్లప్రోలు ఎస్సైగా జాన్ బాషా



**గొల్లప్రోలు,మేజర్‌న్యూస్ :** గొల్లప్రోలు నూతన ఎస్సైగా జాన్ బాషా నియమితులయ్యారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం గొల్లప్రోలు ఎస్ఐగా జాన్ భాష బాధ్యతలు చేపట్టారు.ఇప్పటి వరకు గొల్లప్రోలు ఎస్సైగా పనిచేసిన బాలాజీని కాకినాడ ట్రాఫిక్ ఎస్ఐగా నియమించినట్లు తెలుస్తుంది.సర్పవరం ఎస్సైగా పనిచేస్తున్న జాన్ భాషను గొల్లప్రోలు పోలీస్ స్టేషన్ కు అటాచ్ చేస్తూ జిల్లా ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.దీంతో ఎస్ఐ భాష గొల్లప్రోలు ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు.

–గోప్యంగా బదిలీ..!

గొల్లప్రోలు ఎస్సై బాలాజీ బదిలీ అత్యంత గోప్యంగా జరిగింది. ఆదివారం సాయంత్రం వరకు స్థానిక పోలీస్ సిబ్బందితో సహా ఎవరికి గొల్లప్రోలు ఎస్సై బదిలీ విషయం తెలియకపోవడం గమనార్హం.ఇటీవల మండల పరిధి వన్నెపూడి గ్రామంలో టిడిపి నాయకుడుపై జరిగిన దాడి ఘటనే ఎస్సై బాలాజీ బదిలీకి కారణమని పలువురు భావిస్తున్నారు.

# అభివృద్ధిని పరుగులు పెట్టిస్తా..ఎమ్మెల్యే ఆనందరావు.



**అమలాపురం, మేజర్ న్యూస్ :** ఆనందరావు అంటే అభివృద్ధి గుర్తుకు వచ్చే విధంగా అమలాపురాన్ని తయారు చేస్తానని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనంద రావు అన్నారు. స్థానిక హౌసింగ్ బోర్డు లోని పార్టీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ అమలాపురం పట్టణం మండలంలోని గ్రామాల్లో మౌలిక వసతుల ఇప్పుడు ఏవిధంగా ఉన్నాయో ప్రజలందరికి తెలుసు అతి త్వరలో పట్టణ రూపురేఖలు మారుస్తామన్నారు.అభివృద్దే తన ద్యేయంగా పనిచేస్తానన్నారు. తనను రెండో సారీ ఎమ్మెల్యే గా గెలిపించిన నియోజకవర్గంలోని ప్రజలందరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# విజన్ ఉన్నవాడు..! విషయం ఉన్నవాడు..!! అతడే మద్దిపాటి..

- **నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడిపిస్తాడనే అందరి నమ్మకం**
- **అందుకే అతనికే పట్టం కట్టిన ఓటర్లు**
- **నాలుగు గోడల మధ్య నుంచి జన బాహుళ్యంలోకి..**
- **ఎన్నో ప్రతికూలతలున్నా..మొక్కవోని దీక్ష చేసిన యువకుడు**
- **అదే అతని విజయానికి కారణం..**

**గోపాలపురం,మేజర్‌న్యూస్:**జీతం మాసానికి దాదాపు 2లక్షలు..నాలుగు గోడలమధ్య ఉద్యోగం.. సీన్ కట్‌చేస్తే ఎమ్మెల్యే.. ఊహించని ఘటనతో ప్రజాబాహుళ్యంలోకి వచ్చి..జన్మభూమికి సేవ చేసే రుణం. వీటన్నిటి వెనుక ఎన్నో కష్టాలు, కన్నీళ్లు..నిద్రలేని రాత్రుళ్లు..సొంతవారే వెన్నుపోటు పొడిచిన సందర్భాలు..అన్నీ దాటుకుని నేడు ఒక శాసనసభ్యుడిగా గెలుపొందిరేపోమాపోఅసెంబ్లీలో అడుగుపెడుతున్నాడు 44ఏళ్ల యువకుడు..ఆయనే మన గోపాలపురం శాసన సభ్యుడు మద్దిపాటి వెంకటరాజు.నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెం గ్రామ వాసి మద్దిపాటి వెంకటరాజు. చిన్నతనంలోనే తండ్రి మరణించారు. తల్లి చేతుల్లోనే పెరిగి..కటిక పేదరికం అనుభవిస్తూనే ఇన్ఫర్మేషన్ సిస్టంలో ఎమ్మెస్సీ పూర్తిచేశారు. అనంతరం కొంతకాలం విదేశాల్లో ఉద్యోగం చేశారు. ఊహించని విధంగాఒకరోజు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు తారస పడిన వేళ ఆయన ఆలోచన ప్రజాసేవ వైపు మరిలింది. అంతే..చేస్తున్న ఉద్యోగాన్ని వదిలిపెట్టి ప్రజా సేవకు పునరంకితం అయ్యారు. మద్దిపాటికి ఉన్న విలక్షణమైన ఆలోచన విధానం.. దూరదృష్టి, అపార సృజన వంటి వాటిని గమనించిన చంద్రబాబు కేంద్ర కార్యాలయంలో పనిచేయడానికి ఆహ్వానించారు. తడవు చేయకుండా కేంద్రకార్యాలయంలో జాయిన్‌అయ్యిఅనేక హోదాల్లో సేవలందించారు. 2024 ఎన్నికల్లో గోపాలపురం నుంచి పోటీ చేసి తొలి ప్రయత్నంలోనే ఎమ్మెల్యే అయ్యారు.మద్దిపాటి



గెలుపుఅసాధ్యంఅనుకున్నవేళ ఆయన కున్న విజన్ విజయశిఖరాలను అధిరోహించడానికి కారణం అయ్యింది.

అందరిచూపుఆయనవైపే...ఆయనఎన్నికల్లోవిజయం సాధించకముందే గోపాలపురం నియోజకవర్గంపై ఆయనకుఉన్నవిజన్ఏమిటో ప్రస్ఫూటీకరించారు.ఉభయగోదావరిజిల్లాల్లో చూస్తే అన్ని నియోజవర్గాల్లో బాగా వెనుబడిన నియోజకవర్గం గోపాలపురం. దీన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని, మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఆయన మాటలను విశ్వచించిన ప్రజలు మద్దిపాటికే పట్టం కట్టారు. ఇక అభివృద్ధిని పరుగులు పెట్టించడమే మిగిలి ఉంది. దానికోసమే నియోజకవర్గ ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఎమ్మెల్యేగా ఆయనకు ఉన్న లక్ష్యం.. దూరదృష్టి కచ్చితంగా ప్రగతిపథంలో పడిపిస్తుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.చంద్రబాబుకు బాగా కావాల్సిన వ్యక్తి..అందుకే నిధులకు ఢోకా లేదు. మద్దిపాటి వెంకటరాజు చదువు, దూరదృష్టి..విజన్‌ఉండటం– ఒక కోణం అయితే..అంతకంటే ఎక్కువగా ముఖ్యమంత్రి చందద్రాబుకు సాన్నిహిత్య సంబంధం ఉంది. కరోనా సమయంలో మద్దిపాటి.చంద్రబాబు దగ్గరేఉండి ఆయన బాగోగులు చూసుకోవడంతో ప్రీతిపాత్రమైన వ్యక్తిగా అధినేత మనసులో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నారు వెంకటరాజు.ఈ నేపథ్యంలో మద్దిపాటి కోరుకున్న గోపాలపురం నియోజకవర్గంలో టికెట్ కేటాయించడానికి ఆయన వెనుకాడలేదు. చివరికి నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత కూడా సాక్షాత్తు చంద్రబాబు కాన్వాయిని కార్యకర్తలు అడ్డుకుని మద్దిపాటి మాకొద్దు అంటూ నినదించారు.

అయినా చంద్రబాబు ఎక్కడా తగ్గకుండా ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. అందు వల్ల నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తీసుకురావడానికి మద్దిపాటికి ఏమాత్రం అవరోధాలు ఉండవని పలువురు భావిస్తున్నారు.చంద్రబాబు కూడా మద్దిపాటి గురించి అన్ని విషయాలు తెలియడం వల్ల మద్దిపాటి ఏది అడిగిన ఇవ్వడానికి వెనుకాడరనే విషయం ప్రస్ఫుటం అవుతోంది.

దైవ భక్తి కలిగిన వాడు.. అన్నిటికన్నా మరో ముఖ్యమైన విషయం మద్దిపాటిలో కనిపిస్తుంది. అదే అపారమైన ద్కెవ భక్తి. వాస్తవానికి చిన్ననాటి నుంచి క్రైస్తవ జీవితాన్ని కొనసాగిస్తూ వచ్చారు. యేసుక్రీస్తు అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తాడని నమ్మిన వ్యక్తి ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు. అంతేకాక సర్వమత సమానత్వం పటించే వ్యక్తి. అందుకే మతాలకు అతీతంగా ఓటర్లు మద్దిపాటిని ఎన్నుకున్నారు. దీంతో మద్దిపాటి అందరివాడు అనే ముద్రపడింది.

## బుచ్చిరాజుకు ముస్లింలు ఘన సన్మానం



**అమలాపురం, మేజర్ న్యూస్ :** ముమ్మిడివరం నియోజకవర్గం శాసన సభ్యులు దాట్ల బుచ్చి బాబును ముస్లిం మైనార్టీ విభాగం అధ్యక్షులు అబ్దుల్లా ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు నియోజకవర్గం లో ముస్లింలు ఎమ్మెల్యే బుచ్చిరాజు ఎన్నికల్లో కీలక పాత్ర నిర్వహించడం జరిగిందని పలువురు మాట్లాడారు. అనంతరం బుచ్చిరాజు దుసలువతో సత్కరించి పూలమాలతో ఘనంగా సన్మానించారు ఈకార్యక్రమంలో ఆజాద్, ఇక్తార్,పాదుషా, మహబూబ్, బాషా, రబ్బాని, వలి, షరీఫ్, నూర ఖాన్, జహీర్, తారీఫ్, మీరా, సత్తార్ అనేకమంది ముస్లిం నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవికి గొటుల్ బృందం అభినందనలు

### -ముంపు మండలాల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి



**ఎటపాక, మేజర్ న్యూస్ :** రంపచోడవరం నియోజకవర్గ నూతన ఎమ్మెల్యేమిరి యాలశిరీషాదేవినిరాజవొమంగి మండలం, అనంతగిరి గ్రామంలో స్వగృహంలో గొటుల్ – గోండ్వాన అధ్యయన బృందం,ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మరియు ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ బృందం ఆదివారంగౌరవపూర్వకంగా కలిసి అభినంధనలు తెలియజేయ ఒడం జరిగింది.ఈ సందర్బంగా గొటుల్ వ్యవస్థాపకులు మడివి నెహ్రూ ముంపు మండలాల సమస్యలపై ప్రత్యేకంగా ధ్రుష్టి పెట్టి సమస్యలు పరిష్కరించాలని అలానే ముంపు మండలాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో కూడిన నిధిని కేటాయించి అభివృద్ధి చేపట్టాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తుష్టి జోగారావు,ఇండియా ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి కారం దారయ్య,ఏ టి ఏ ఎటపాక మండల అధ్యక్షులు కాక రాజు,గొటుల్ బృంద సభ్యులు సూరకుంట గ్రామ పెద్ద తోడం చంద్రయ్య,పూజారి తోడం మల్లేష్,యువ ప్రతినిధులు సోడె శ్రీను,గోరం రాఘవ కూర జోగారావు పాల్గొన్నారు.

## మంత్రి సుభాష్‌కు రావులపాలెంలో ఘనస్వాగతం

### -ఎమ్మెల్యే బండారు సత్యానందరావు,శ్రీనివాస్



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ మంత్రివర్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మొదటిసారి రామచంద్రపురం నియోజకవర్గానికి విచ్చేస్తున్న వాసంశెట్టి సుభాష్‌కు రావులపాలెం సెంటర్ లో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ,జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఈదురుగాలులతో భారీ వర్షం

### -కాకినాడ రోడ్డులో నేలకొరిగిన చెట్లు



**సామర్లకోట,మేజర్‌న్యూస్ :**సామర్లకోటలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు గంటకు పైగా కురిసిన వర్షానికి పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి. సామర్లకోట–కాకినాడ రోడ్డులో వి. కె.రాయపురం వద్ద భారీ వృక్షాలు నేలకొరిగి ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానిక జూనియర్ కళాశాల ప్రహరీ గోడకు ఆనుకుని ఉన్న చెట్లు విరిగి కరెంటు వైర్లపై పడ్డాయి. విద్యుత్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని చెట్ల కొమ్మలను తొలగించే చర్యలు చేపట్టారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు సమయం పడుతుందని విద్యుత్ అధికారులు తెలిపారు.

## పిడుగుపాటుకు రెండు గేదెలు మృతి



**గోపాలపురం,మేజర్ న్యూస్ :** గోపాలపురం నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులు,పిడుగులతో కూడిన భారీవర్షంకురిసింది పిడుగుపాటుకు గోపాలపురం శివారులోని మరీదు ప్రసాద్ అనే రైతు పొలంలో ఉన్న రెండు గేదెలు మృతిచెందాయి. యజమాని ప్రసాద్ తనకున్న రెండు గేదెలు చనిపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో గేదె విలువ రూ.లక్ష వరకు ఉంటుందని..రెండిరటి విలువరూ.2లక్షలని తెలిపారు.ప్రకృతి వైపరీత్యం కారణంగా జరిగిన ఈ విపత్తులో ప్రభుత్వం తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ట్రోఫీ బహూకరణ



**అంబాజీపేట,మేజర్‌న్యూస్ :** మండల పరిధి చిరుతపూడి, చిట్టి చెరువు గట్టులో జరిగిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల నిర్వహించారు. టోర్నమెంట్ విజేతలయిన క్రికెట్ విన్నర్స్ అండ్ రన్నర్స్‌కి ట్రోఫీ అందచేసారు. జనసేన పార్టీ గ్రామ పార్టీ ప్రెసిడెంట్ తోట కృష్ణ అర్జున్ రావు, మండల కార్యదర్శి సూరిశెట్టి నాగరాజు, నక్క నరేష్ , రంపం చిన్న, కోసూరి సాయి, కోలపల్లి దుర్గాప్రసాద్, గ్రామస్తులు కలిసి గెలిచిన విన్నర్స్ టీం కెప్టెన్ ఎల్.వెంకటరమణ అలాగే రన్నర్స్ టీం కెప్టెన్ ఆర్.నవీన్ వారికి ట్రోఫీ అందజేయడం జరిగింది.

# ప్రజలిచ్చిన బాధ్యతను మరిచిపోను

### -ఎంపీ ఉదయ్ శ్రీనివాస్






**కాకినాడ, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు ప్రజలు ఇచ్చిన బాధ్యత మరిచిపోనని కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధికి ఢిల్లీ నుంచి అత్యధిక నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పథంలో పయనించేందుకు తన వంతు ఎనలేని కృషి చేస్తానని చెప్పారు. శనివారం కాకినాడ అచ్చుతాపురం రైల్వే గేటు దగ్గర ఉన్న లలిత ఫర్నిచర్ షోరూమ్ వద్ద జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అధికారానికి వచ్చిన సందర్భంగా లలిత అధినేత టీ లక్ష్మణస్వామి (రాంబాబు) ఆధ్వర్యంలో 164 స్వీట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉదయ్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సమాంతర పాలన రాష్ట్రంలో జరుగుతుందని చెప్పారు. తనకు పార్లమెంట్ పరిధిలో సుమారు రెండున్నర లక్షల పైగా మెజార్టీ వచ్చిందని వైసీపీ దుష్ట ఆలోచన వల్ల మరో 40 వేల వరకు మెజార్టీ తగ్గిందన్నారు. ప్రజలు ఇచ్చిన బాధ్యతను మర్చిపోలేనన్నారు. అనంతరం స్వీట్స్ అందించారు. ఇంకా ఈ కార్యక్రమంలో కాకినాడ రూరల్ టీడీపీ సమన్వయ కమిటీ సభ్యుడు కటకంశెట్టి బాబి, నగర టీడీపీ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, ఇంకా దుగ్గన బాబ్జి, నక్క శ్రీహరి, అడబాల సత్యనారాయణ, ఆకుల శ్రీనివాస్, నందమూరి వినోద్, కే రమేష్ కుమార్, నల్లం శ్రీనివాస్, చోడిశెట్టి శ్రీమన్నారాయణ తదితర టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామిక లౌకికవాదంతో రచయితలు పనిచేయాలి

### -అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివ ప్రసాద్



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ప్రజాస్వామిక లౌకికవాద దృష్టితో రచయితలు పనిచేయాలని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక పి.ఆర్.ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్ లో జరిగిన అభ్యుదయ రచయితల సంఘం (అరసం) కాకినాడ జిల్లా ప్రథమ మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ 80 సంవత్సరాల అరసం ఆవిర్భావ వికాసాల గురించి తెలియజేస్తూ సాహిత్య, సాంస్కృతిక రంగాలను ప్రభుత్వం విస్మరించడం విచారకరమన్నారు. మానసిక వికాసానికి దోహదపడే గ్రంథాలయాలను పునర్జీవింప చేయాల్సిన అవసరం ఉందని వల్లూరు శివప్రసాద్ పేర్కొన్నారు. ఈ సభకు కన్వీనర్స్ గా గండి స్వామి ప్రసాద్, వేదుల శ్రీరామ శర్మ (శిరీష) వ్యవహరించారు. మహాసభకు కవి, రచయిత దాట్ల దేవదానం రాజు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో అరసం రాష్ట్ర కార్యదర్శి బొల్లినేని నాగార్జున సాగర్, అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పడాల వీరభద్రరావు, చెరుకుమల్లి సింగారావులు మాట్లాడుతూ సమాజ హితమే సాహిత్య లక్ష్యం అయి ఉండాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కవి సమ్మేళనం ఏర్పాటు చేయబడింది. వర్ధమాన కవులు 48 మంది కవి సమ్మేళనంలో పాల్గొని తమ కవితలను వినిపించారు.ఈ సందర్భంగా అరసం కాకినాడ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. అధ్యక్షునిగా పత్సమట్ల సుబ్బరాజు, ప్రధాన కార్యదర్శిగా పి. పద్మజావాణి, గౌరవ సలహాదారులుగా వేదుల శ్రీరామ్ శర్మ, ఆర్. సత్యభామ, ఉపాధ్యక్షులుగా వాడపల్లి వెంకటరమణమ్మ, డాక్టర్ అద్దాల సత్యనారాయణ, కొల్లు ప్రసన్నకుమార్, కార్యదర్శులుగా ఎం. ఉండవల్లి, అద్దేపల్లి జ్యోతి, అవధానులు మణిబాబు, కార్యవర్గ సభ్యులుగా మధునాపంతులు సత్యనారాయణమూర్తి, రాంపల్లి వెంకటరమణ (మహర్షి రమణ), గుండు శ్రీనివాసరావు, దాడి గోవిందరావు, జి. సావిత్రి ప్రసాద్, రాధిక,వక్కలంక శారద, ఎన్.వి.పద్మావతి, తోకల ప్రసాదరావు, సి.వి.వి. సత్యనారాయణ, ఎన్.వి.ఎస్. ఇందిర, డాక్టర్ ఎన్. సూర్యనారాయణ, డాక్టర్ పి.ఎస్. ప్రకాశరావు, ఆర్‌వి.వి.రాజాఎన్నికయ్యారు.

## రాక్ యాజమాన్యం కార్మికులను బయపెట్టడం మానుకోవాలి

### -సిఐటియు జిల్లా కార్యదర్శి క్రాంతి కుమార్




**సామర్లకోట,మేజర్‌న్యూస్:** రాక్ సిరామిక్స్ యాజమాన్యం కార్మికులను చర్చలపేరుతో పిలిచి బెదిరింపులకు పాల్పడడం మానుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి డి.క్రాంతి కుమార్ అన్నారు.రాక్ సిరామిక్స్ కంపెనీ గేటు ముందు 7వ రోజు కార్మికులునిరసన కొనసాగించారు.ఈనిరసననుఉద్దేశించిక్రాంతికుమార్ మాట్లాడుతూ రాక్ యాజమాన్యం కార్మికులను చర్చలపేరుతో కొంత మంది కార్మికులను పిలిచిందనికానీసమస్యపైమాట్లాడడమానేసికార్మికులనుబెదిరించడం ప్రారంభించరని అన్నారు. పోలీసులు లాఠీచార్జీ చేస్తారని గేటు ముందు ధర్నా చెయ్యడం కుదరదని చెప్పడం దారుణమన్నారు. సమస్యలను పరిష్కరించడానికి చొరవ చూపాలి తప్ప బెదిరింపులకు పాల్పడడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, సతీష్, రామకృష్ణ, వరప్రసాద్, మల్లికార్జునరావు, గంగాధర్, క్రాంతి, మంగారావు,అర్జున్ రావు,మూర్తి, సత్యనారాయణ, చంద్రన్న, ప్రభుదాస్, రామచంద్రయ్య, రాజబాబు, సతీష్ కుమార్, శివ నారాయణ, సుబ్బారావు తదితరులు పాల్గోన్నారు.

## ది ఆర్యాపురం సియూబి లిమిటేడ్ ఓటర్ల జాబితా ప్రదర్శన

### -ఓటర్ల జాబితాపై లిఖిత పూర్వకంగా అభ్యంతరాలు స్వీకరణ

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ది ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లి., నెం.3127, రాజమండ్రి యొక్క పాలకవర్గం ఎన్నికలు ది.20.07.2024 వ తేదిన జరుపుటకు తూర్పుగోదావరి జిల్లా, జిల్లా కలెక్టర్/జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత ఎన్నికల నోటిఫికేషన్ జారిచేసియున్నారని సెక్రెటరి/ముఖ్య కార్యదర్శి, ది ఆర్యాపురం కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లి.నెం.3127,రాజమండ్రి కె.స్వరాజ్యలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలియ చేసి ఉన్నారు.ది.ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లి.,యొక్క ఎన్నికల నిర్వహణలో భాగంగా ది.17–06–2024 వ తేదిన బ్యాంకు బ్రాంచిల యందు ప్రాథమిక ఓటర్ల జాబితా అందుబాటులో ఉంచడమైనది. సదరు ఓటర్ల జాబితా యందు సభ్యులకు ఏమైనా అభ్యంతరములు ఉన్నయెడల, ది.24–06–2024 వ తేది లోపుగా సంబంధిత బ్రాంచి మేనేజర్ ద్వారా బ్యాంకు సెక్రెటరి/ ముఖ్య కార్యదర్శి వార్కి లిఖిత పూర్వకంగా సమర్పించవలెనని తెలియ చేసారు.

గడువు లోపుగా ఏవిధమైన లిఖిత పూర్వకంగా అభ్యంతరంములు రానియెడల, ప్రాథమిక ఓటర్ల జాబితాపై ఎటువంటి అభ్యంతరములు లేవని భావించి, తుది ఓటర్ల జాబితా ఎన్నికల అధికారి వార్కి సమర్పించబడును. మరియు అప్పు వాయిదా మీరిన సభ్యుల జాబితా కూడా బ్రాంచిల వద్ద గలదు సదరు సభ్యులు వాయిదా మీరిన బకాయిలు వడ్డీతో సహా బ్యాంకు వార్కి పూర్తిగా చెల్లించన యెడల, సంబంధిత సభ్యుల పేర్లు ఓటర్ల తుది జాబితాలో చేర్చబడును. తుది గడువు అనంతరం అనగా ది.24–06–2024వ తేదీ తదుపరి ఓటర్ల జాబితాపై వచ్చే ఎటువంటి అభ్యంతరములు స్వీకరించబడవు. సవివరమైన ఎన్నికల నోటిఫికేషన్ ది.04–07–2024 వ తేదిన ఎన్నికల అధికారి వారిచే ప్రకటించబడునని బ్యాంకు సభ్యులందరికి సదరు ప్రకటనలో తెలియపర్చడమైనది.

## సమాచారం ఇవ్వని అధికారులపై పోలీసు కేసు పెట్టవచ్చు

### -రాష్ట్ర సమాచార కమిషన్




**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఆర్టీఐ దరఖాస్తు ద్వారా సమాచారం అడిగిన తరువాత మా దగ్గర ఇంతే సమాచారం ఉంది అంటూ కొంత సమాచారం ఇచ్చి మిగిలింది మా వద్ద లేదని ఇస్తున్నారు. ఉద్యోగులు అలా లేదు అనే ముందు అట్టి ఫైళ్లు ఏమైయ్యాయి కనబడని ఫైళ్లు పోయిన ఫైళ్లు గురించి పోలీస్ ఫిర్యాదు చేశారా? లేదా చేయకపోతే ఎందుకు చేయలేదు? అంత నిర్లక్ష్యంగాఎందుకు వ్యవహరించారు. ఉద్యోగ బాధ్యతల్లో తమ వంతు కర్తవ్యం నిర్వర్తిస్తున్నారా? లేదా? అలా పోలీసు కంప్లైంట్ ఇవ్వని అధికారి పై ఆర్టీఐ దరఖాస్తు దారుడు కేసులు పెట్టవచ్చునని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి. ఫైళ్లు పోయినా చర్యలు లేవా? ఉంటే ఎటువంటి చర్యలు తీసుకుంటారు.? ఇకపై ఆర్టీఐ దరఖాస్తు ద్వారా సమాచారం అడిగిన సోదరి.. సోదరులారా.. అడిగిన సమాచారం కొంత ఇచ్చి మిగిలిన సమాచారం ఇవ్వని పక్షంలో అట్టి సమాచారం వారి వద్ద లేదని భావించి వారిపై పోలీసు ఫిర్యాదు చేయవచ్చు. ఈ విషయం స్వయంగా సమాచార కమిషన్ వారు తెలిపారు. ఇకపై ఆర్టీఐ కార్యకర్తలు గుర్తు ఉంచుకొని అట్టి అధికారులపై చర్యలు కొరకు పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేయవచ్చు.


## గోదాములు తనిఖీ చేసిన మంత్రి నాదెండ్ల



**కాకినాడ, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెనాలిలో నిల్వ గోదాములను శనివారం తనిఖీ చేశారు. తర్వాత మంగళగిరిలోనూ గోదాములను తనిఖీ చేయించారు. అక్కడా నిర్దేశిత పరిమాణం కంటే తూకం తక్కువగా ఉన్నట్లు తనిఖీల్లో తేలింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా కందిపప్పు, పంచదార, నూనె తదితర ప్యాకెట్ల పంపిణీ నిలిపేయాలని ఆయన ఆదేశించారు. వారం రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు.

## భర్త చేతిలో భార్య హత్య

### హార్బర్ పేటలో విషాదం
### పోలీసులు అదుపులో నిందితుడు



**కాకినాడరూరల్,మేజర్‌న్యూస్:**కాకినాడ రూరల్ ఫిషింగ్ హార్బార్ పేటలో ఒలేటి సీత (25)అనే మహిళదారుణహత్యకు గురయ్యిం ది. ఈ సంఘటన కు సంబంధించి స్థానికులు,పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారంఇంట్లో నిద్రిస్తుండగా తల పైన గట్టిగా కొట్టి భర్త నరసింహమూర్తి అతి కిరాతకంగా హత్యకు పాల్పడ్డాడు. ఒక ప్రయివేట్ రొయ్యలకంపెనీలో సీత పనిచేస్తుంది.వేరేప్రాంతం నుండి వలస వచ్చిన భార్య,భర్తలుస్థానికంగానివాసం ఉంటున్నారు. భర్త నరసింహ మూర్తి జెట్టిలో రిక్షా కార్మికుడుగా పనిచేస్తూ రాత్రుళ్ళు వాచుమాన్‌గా పనిచేస్తున్నాడు.గతవారం రోజులు నుండి డబ్బులు కోసం సీతను వేధిస్తున్న నరసింహమూర్తి ఎన్నికల్లో ఒకపార్టీ గెలుస్తుంది అనిబెట్టింగ్ వేసి అప్పులు పాలయ్యినట్లు తెలుపుతున్నారు. నిందుతుడును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు